


"ఏడుకొండలవాడా -
వెంకటరమణా -
గోవిందా గోవింద!
ఆపద మొక్కులవాడా -
అనాథ రక్షకా -
గోవిందా గోవింద!"

తిరుపతి ఏడుకొండలవాడి గుడిలో క్యూ అతిమెల్లగా సాగుతోంది. క్యూలో ఇరవై ఎనిమిదేళ్ళ సుశీల నాలుగేళ్ళ బాబుతో నిలబడి అలసిపోతోంది.

సుశీల వెనకాల ఒక అరవై ఏళ్ళ వితంతువు నిలబడి వుంది. పాతికేళ్ళ కొడుకుతో వచ్చింది. మనిషి మంచి మాటకారి. తన పేరు పార్వతమ్మగా పరిచయం చేసుకుంది. అందర్నీ పలకరిస్తోంది. మనిషి మంచి ఉత్సాహంతో 'అరవైలో ఇరవై వయసు' అన్నట్టుగా వుంది.

క్యూ గర్భగుడిలో ప్రవేశించింది. అక్కడ భక్తులు హుండీలో వేసిన కానుకలను వేరుచేస్తున్నారు గుడి పరివారం. దానికి రన్నింగ్ కామెంటరీ మొదలెట్టింది పార్వతమ్మ.

"మాశారా, ఎవరో మంగళసూత్రాలు వేశారు! భర్తకు ఏ గండం గడిస్తే అవి వేస్తానని మొక్కుకుందో ఆ అదృష్టవంతురాలు. ఈ కానుకలకే కనుక నోరుంటే ఆ ఏడుకొండలవాడి మహిమను ఎన్ని విధాల చాటిచెప్పేవో!

వింటున్న సుశీలకు విసుగుతో బాటు నవ్వు కూడా వచ్చింది.

"ఎవరో నిలువుదోపిడీ ఇచ్చినట్లున్నారు. కమ్మలు, గాజులు, ముక్కుపుడక, నల్లపూసలు, సూత్రాలు! అన్ని విలువైన వస్తువులను స్వామికి సమర్పించింది. ఆపదమొక్కులవాడు ఆవిడను ఏ ఆపదనుంచి ఆదుకున్నాడో!" ఏదో మాట్లాడుతూనే వుంది పార్వతమ్మ. వింటున్న సుశీలకు వొళ్ళు మండింది. దురుసుగా అంది- "పేపర్లో చదివాను. ఎవరో ఒకసారి సిగరెట్ ప్యాకెట్ వేశారట. దానికేమంటారు?" ఆవిడ ఓ నిమిషం మాట్లాడలేదు. తర్వాత అంది "లోకులు పలు రకాలు. పుర్రెకో బుద్ధి అన్నారు. పని ఏదైనా కాని ఆ పని వెనకాల వున్న వుద్దేశం మంచిదైతే చాలు. స్వామి అర్థం చేసుకుని క్షమించగలడు. ఏమో ఆ సిగరెట్ ప్యాకెట్ వేసినతనికి ఏ కాన్సరో వచ్చి, అది నయమైతే అదే ఆఖరి సిగరెట్, ఇక తాగను, దానికి మానసిక శక్తి నివ్వమని స్వామిని వేడుకుంటూ ఆఖరి ప్యాకెట్ పడేశాడేమో!"

సుశీల కా జవాబు పెద్ద తృప్తి నివ్వలేదు. మాట పెంచడం ఇష్టంలేక మొహం తిప్పుకుంది.

* * *

స్వామి దర్శనం అయిపోయింది. సుశీల బాబుకు విమాన వెంకటేశ్వర్లుని చూపించి కాస్త విశ్రాంతిగా ఓ వైపు కూర్చుంది. కాసేపయాక పార్వతమ్మ కూడా కొడుకుతో బాటువచ్చి సుశీల పక్కన కూర్చుని మాటలు మొదలెట్టింది.

సుశీల కెందుకో తిక్క రేగింది. ఆవిడను నొప్పించాలన్న కోర్కె పుట్టింది. దూకుడుగా తన కథ చెప్పడం మొదలెట్టింది "నా చేతుల్లో వున్నవేమిటో తెలుసా? మంగళసూత్రాలు. నా భర్తను ఏ ఆపద నుంచో స్వామి కాపాడితే నేనివి సమర్పించడం లేదు. నా భర్తను నేను వదిలేస్తున్నాను. ఇంకో విధంగా చెప్పాలంటే స్వామితో చెప్పి ఈ గుడిని ఆయన




కోర్టుగా భావించి డైవోర్స్ తీసుకుంటున్నాను. నాకు పూనెలో వుద్యోగం వచ్చింది. ఇప్పుడు తాళిబొట్టు హుండీలో వేస్తాను. గుడి బయటికి వెళ్ళిన వెంటనే మొహాన బొట్టు తుడిచేస్తాను. వితంతువులా పూనెలో కొత్త ప్రదేశంలో, కొత్త మనుషుల మధ్య కొత్త జీవితం మొదలెడ్తున్నాను. భర్త వదిలేశాడు అంటే లోకం చులకనగా చూస్తుంది. భర్త పోయాడు అంటే సానుభూతి చూపిస్తుంది. నా భర్త ఒట్టి తాగుబోతు. ఆయనకు లేని దుర్గుణాలంటూ లేవు. ఇన్నాళ్ళూ ఆయన తిట్లు, తన్నులు, ఆగడాలు- అన్నీ ఈ బాబు కోసం భరించాను. ఇప్పుడు కూడా ఈ బాబు భవిష్యత్తు కోసమే ఏదో ఒకటి చేయక తప్పేట్టు లేదు. అందుకే ఎవరికీ తెలియకుండా కొత్త చోటికి పారిపోతున్నాను" ఓ క్షణం ఆగింది.

తిరిగి చెప్పడం మొదలెట్టింది "నేను చాలా సనాతన కుటుంబంలోంచే వచ్చాను. నేను చేస్తున్న ఈ పనిని ఎవరూ హర్షించరని, ముఖ్యంగా నా తల్లిదండ్రులు సిగ్గుతో చితికిపోతారని నాకు తెలుసు. కాని ఏం చెయ్యను? నాకు కనబడుతున్న మార్గం ఇదొక్కటే! ఈ బాబు కోసం ఇంత ధైర్యం చేస్తున్నాను. రేపు పెరిగి పెద్దవాడైతే, నేను చేసిన ఈ పనికి వీడేమంటాడో!" దుఃఖంతో సుశీల గొంతు బొంగురుపోయింది.

అయిదు నిమిషాలు అందరూ నిశ్శబ్దంగా వుండిపోయారు. తర్వాత తేరుకుని అంది పార్వతమ్మ- "భగవంతుని లీలలు ఎంత విచిత్రం! ఎంత తమాషాగా మనల్నిద్దర్నీ కలిపాడు. సరిగ్గా పాతికేళ్ళ క్రితం నేనూ నీలాగే కొడుకు జీవితం కోసం, వాడి

బాగు కోసం అందరి కాళ్ళూ పట్టుకున్నాను. ఆయన పోయాక, ప్రతి రోజు ఛస్తూ, నిజంగా చావలేక జీవచ్ఛవంలా అందరి పంచన బ్రతికాను. నాకున్న ఆస్తి అందరికీ పంచి ఇచ్చి కూడా అందరిచేత మాట పడ్డాను. అందరిళ్ళల్లో గొడ్డు చాకిరీ చేశాను. ఇన్నాళ్ళకు నా కష్టాలు కడతేరాయి. నేనిలా దైవ దర్శనానికి రావడానికి కారణం కూడా అదే. నా కొడుక్కు ఉద్యోగం వచ్చింది. పాతికేళ్ళ పంజరపు బ్రతుకు అయిపోయింది. ఆ పాతికేళ్ళు నేనే కనుక చదువుకుని వుంటే, స్వతంత్రంగా ఎంత హాయిగా బ్రతికేదాన్ని అని అనుకోని క్షణం లేదు. మరి, ఆ కాస్త చదువు చేతిలో వుండబట్టే నీవా పని చేస్తుంటే, నీకు ధైర్యం చెప్పి ప్రోత్సహించాల్సింది పోయి, నాలాగా

> "నేను స్వామికి హుండీలో వేయబోతున్నదేమిటో తెలుసా- ఈ మంగళసూత్రాలు! ఈ తిరుపతిలో స్వామి సాన్నిధ్యం కోర్టుగా భావించి నా భర్తకు నేను విడాకులు ఇస్తున్నాను. అన్ని దుర్గుణాలూ వున్న ఆయన తిట్లూ, తన్నులూ ఇన్నాళ్ళూ ఈ బాబు కోసం భరించాను. నా బాబును పోషించుకునేందుకు నాకు ఉద్యోగం వుంది..."

బ్రతకమని నేనెందుకంటాను? తిరుపతి వెంకటేశ్వరుడు కలియుగ దైవం. ఈ కాలంలో వచ్చిన మార్పులు ఆయనక్కూడా తెలుసు. ఆయన అర్థం చేసుకుని క్షమిస్తాడేమో కాని, శపించడు. పద, నేను దగ్గరుండి నీ చేత మంగళసూత్రాలు హుండీలో వేయించి, నీ కొత్త జీవితానికి నాంది పలుకుతాను. లే" పార్వతమ్మ ప్రేమగా సుశీలను లేపింది.

ఈసారి దిగ్భ్రాంతి చెందడం సుశీల వంతయింది. వింటున్న పార్వతమ్మ కొడుకు కూడా ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

ఎవరో భక్తుడు భక్తి పారవశ్యంతో వెంకటేశ్వర స్తోత్రం పఠిస్తూ ప్రదక్షిణం చేస్తున్నాడు.


—మల్లాది లక్ష్మి

## నేను పోయాననుకున్నారేమో!

ప్రముఖ రంగస్థల, రేడియో నటులు శ్రీ బందా కనక లింగేశ్వరరావు వ్రాసిన 'పాండవోద్యోగ విజయాలు' అనే పౌరాణిక నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శిస్తుండేవారు. ఆ నాటక ప్రదర్శన వల్ల ఆయనకు అటు ధనం, ఇటు మంచి పేరు ప్రఖ్యాతులూ వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన వెళ్ళపిళ్ళ వారికి విజయవాడలో ఘన సన్మానం ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా విశ్వనాథ సత్యనారాయణగారు తమ గురువులైన వెళ్ళపిళ్ళ వారి మీద "గురుభ్యో నమః" అంటూ నవరత్నాల వంటి తొమ్మిది పద్యాలు చదివారు.

ఆ శుభ సందర్భంలో అప్పట్లో ఆంధ్రపత్రికలో పనిచేస్తున్న నీలంరాజు వెంకటశేషయ్యగారు ఒక గ్రూపు ఫోటో కావాలన్నారట. ఆ పనికి రావూరి భరద్వాజగారు పూనుకున్నారు. గురువుగారైన వెళ్ళపిళ్ళ వారితో పాటు పాటిబండ్ల మాధవశర్మ, పువ్వాడ శేషగిరి రావు, ఎర్రోజు మాధవాచార్యులు, విశ్వనాథ సత్యనారాయణ ఆదిగా గల సాహితీ దిగ్గజాలు ఆ గ్రూప్ ఫోటో కోసం నిలబడ్డారు.

అలాంటి అరుదైన మేలు కలయికను చూడడం



## గాధావళి

అసాధ్యమని తలచిన సాహితీ మిత్రులు, అభిమానులు వందల సంఖ్యలో విరగబడ్డారట. అంతమంది జనం అలా రావడం వల్ల ఆశ్చర్యం కలిగిన వెళ్ళపిళ్ళ వారు "నేను పోయాననుకున్నారో ఏమో జనం! అందుకే ఇలా వచ్చి వుంటారు! పర్వాలేదు, నేను పోతే కనీసం అయిదు వందల మందయినా వస్తారనుకుంటా! రావూరూ నీ 'వడగళ్ళ'కు మంచి శీర్షిక దొరికిందోయ్!" అన్నారట.

అక్కడ జేరిన శిష్య బృందంతోపాటు, సాహితీ బంధువులంతా పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకున్నారట.

—ఎం.డి.సౌజన్య

## అక్కడ స్త్రీలకే అగ్రతాంబూలాలు

మన దేశంలో కొన్ని ఆదిమ జాతుల తెగలలో ఈ మాతృస్వామ్య వ్యవస్థ నేటికీ కొనసాగుతున్నదని పరిశోధకులు పలుకుతున్నారు. "ధారు" అనే ఆదిమజాతి తెగ ఈ వ్యవస్థకు సంబంధించినవారు. వీరు ఎక్కువగా హిమవత్పర్వత ప్రాంతాలలోనూ, ఉత్తరప్రదేశ్‌లో తరాయి ప్రాంతంలో వున్నారు. వీరు తాము శిశోదియా వంశపు రాజపుత్రికులమని చెప్పుకుంటారు.

తమ స్త్రీలకు ఆ శక్తి సామర్థ్యాలు కలగడానికి కారణం వీరిలా చెబుతారు. మొగలాయిల దండయాత్రల సందర్భంగా రాజపుత్రుల స్త్రీలందరినీ కొందరు సేవకుల అండదండలతో హిమవత్పర్వత ప్రాంత గ్రామాలలోనికి తలదాచుకోను పంపించారట. ఎంత కాలానికీ తమ భర్తలు తిరిగిరాని కారణంగా వీరా సేవకులను వివాహ మాడారని, అప్పుడు జన్మించిన జాతి తమ ధార్ జాతి అని చెబుతారు. వీరి భర్తలైన ఆ సేవకులకు తాము సేవకులము అనే తక్కువ భావన నరనరాల్లో జీర్ణించిన కారణంగా స్త్రీల ఆధిక్యం పరంపరాగతంగా వచ్చిందని భావించవచ్చు. మగవాని చేట వాలుక లేకపోతే ఆ యింట మగువ పెత్తనం రావడం సహజమే కదా! కుటుంబ రక్షకు ఎవరో ఒకరు బాధ్యత తీసికోకతప్పదు.

ఈ ధార్ జాతివారు పురుషులింట వుండి గృహ కార్యనిర్వహణ చేస్తుంటే స్త్రీలు బయటకు వెళ్ళి సంపాయిస్తుంటారు. శారీరక శ్రమ వీరు గొప్పగా భావిస్తారు. వీరు "మంగోలి" జాతికి చెందిన స్త్రీలుగా కూడా పరిశోధకులు చెప్తారు. ఈ స్త్రీలలో పంచాయతీలు తీర్చే పెద్ద కూడా స్త్రీయే. ఆమెను "బరారా" అని పిలుస్తారు. వీరిలో బాల్య వివాహాల దురాచారం వున్నది. వరకట్నం మాత్రం చాలా స్వల్పంగా వుంటుంది. ఈ పెళ్ళి ఖర్చంతా స్త్రీలే సంపాదించి భరిస్తారు. భర్త ప్రవర్తన నచ్చకపోతే భార్య తేలికగా విడాకులీయవచ్చు కాని భర్తకు ఆ హక్కు లేదు. ఈ జాతివారు ఆర్థికంగా సరి పుష్టి పొందకపోయినా ఒకరిమీద ఆధారపడరు. భిక్షాటన వీరిలో నిషేధం. నాగరికతా వాసనలు ఎంతగా వీరిని సోకుతున్నా వీరు తమ సంప్రదాయాలను వదిలిపెట్టరు. నృత్య కళ అంటే ఆసక్తి.

గమనించాల్సిన విషయమేమిటంటే పురుషస్వామ్య వ్యవస్థలో పురుషుడు అధికారాలు మరీ ఎక్కువ దఖలు పరుచుకుని స్త్రీని బానిసగా చూస్తాడు. కాని ఈ స్త్రీలు మాత్రం తమ పురుషులను సమానంగా, గౌరవంగా చూస్తారు. పురుషులను గౌరవించే ఈ ధార్ మాతృస్వామ్య వ్యవస్థ అభినందనీయమనే చెప్పాలి. ఇప్పుడు మనలో స్త్రీలు సంపాదిస్తున్నప్పటికీ పురుష స్వామ్య వ్యవస్థే కొనసాగడానికి కారణం అంతగా ఆ వ్యవస్థ కుటుంబ జీవితంలో పీఠం వేసుకుని పడతులకు చాలా సందర్భాల్లో పాట్లు తెచ్చిపెడుతోంది. ఈ మాతృస్వామ్య వ్యవస్థాంశాలు కొన్నయినా మహిళాభ్యుదయానికి అవసరమేమో!

—ఎస్.జ్ఞానేశ్వరి

### అసలు కారణం

"మీ స్నేహితుడు చెట్టు మీద నుంచి పడి చనిపోయాడటగా!"

"అవును."

"చెట్టు ఎక్కకుండా వుంటే ఇలా జరిగేది కాదేమో! ఇంతకు చెట్టు ఎందుకు ఎక్కినట్టు?"

"ఉరిపోసుకుందామని తాడు కట్టడానికి."

— కె.వి.ఎం.ఆర్. (కాకినాడ)